# సంఘర్షణ



ఆంధ్రభూమి వీక్లీ, 24 జూలై 2003

"గుడ్ మార్నింగ్ సార్!"

బ్రాంచి మేనేజరు గదిలోకి అడుగుపెట్టిన శ్రీధర్ ఆయన్ని విష్ చేశాడు.

"గుడ్ మార్నింగ్... కూర్చోండి! ఎప్పుడొచ్చారు ఊరి నుంచి?"

"ఉదయమే వచ్చాను సార్! ఈవారం రోజులూ నా సీటు వర్క్ ఎవరికైనా అలాట్ చేశారా?"

"అవును. రమేష్‌ని ఏవైనా అర్జెంటు మేటర్స్ ఉంటే చూసుకోమన్నాను."

"ఉంటాను సార్... గుడ్ డే!"

– అని చెప్పి బయటకు వచ్చాడు.

నిజానికి- అతడు డ్యూటీలో జాయిన్ కాగానే తన సీట్లో ఎంతో ముఖ్యమైనవి, ఆలస్యం చేస్తే సంస్థకు నష్టం వచ్చే పనులకు సంబంధించిన కాగితాలు పెండింగ్ ఫైల్‌లో ఉండటం చూశాడు.

ఆ విషయం బ్రాంచి మేనేజరుతో చెబుదామనే ఆయన దగ్గరికి వెళ్లాడు. కానీ, రమేష్‌పై చాడీలు చెప్పినట్లు ఉంటుందని ఆ ప్రయత్నం మానుకున్నాడు.

సీట్లో కూర్చొని పెండింగ్ ఫైల్ తీసి, ముఖ్యమైన పనులకు అటెండ్ అవసాగాడు.

ఇంతలో... అటుగా వెళ్తున్న రమేష్ కనిపించాడు అతనికి.

"హలో రమేష్‌గారూ... ఒక్క నిమిషం!" అంటూ పిలిచాడు శ్రీధర్. అతను దగ్గరికి రాగానే- "మీరు నా సీటు చూసుకున్నారట కదా! ఇవి చాలా ముఖ్యమైన, వెంటనే మనం అటెండ్ చేయవలసిన పేపర్లు సార్! ఏదైనా అనుకోనిది జరిగితే మన సంస్థకు ఎంతో నష్టం వస్తుంది. ఎందుకు వీటిని పెండింగ్‌లో పెట్టవలసి వచ్చింది?" అన్నాడు.

"ఆర్ యు మై బాస్?"

అర్థంకానట్లు చూశాడు శ్రీధర్.

"మీరు నాకు బాసా? అలా నిలదీసి అడుగుతున్నారు? మీరేదైనా చెప్పుకోదలిస్తే బ్రాంచి మేనేజరుతో పోయి చెప్పుకోండి. నన్ను అడిగే అధికారం మీకు లేదు. మీరూ నాలాగే ఓ క్లర్క్! ఆ విషయం గుర్తుంచుకోండి!" కోపంగా, దాదాపు అరచినట్టే అన్నాడు రమేష్.

నోట మాట రానట్టు నిలబడిపోయాడు శ్రీధర్.

రమేష్ అలా మాట్లాడతాడని అతను ఊహించలేదు. అందరూ తమవైపే చూస్తూండటంతో అవమానంగా కూడా ఫీలయ్యాడు.

"ఓ.కే. రమేష్... ఐ యామ్ సారీ! మీతో ఉన్న కొద్దిపాటి స్నేహం వల్ల, మన సంస్థకు నష్టం వస్తుందనే ఆదుర్దా వల్ల, ముఖ్యంగా దానివల్ల మీ ఉద్యోగానికి ప్రమాదం వస్తుందనే భయం వల్ల మిమ్మల్ని అడిగాను... సారీ!"

రమేష్ ఏం మాట్లాడకుండా వెళ్లిపోయాడు.

శ్రీధర్ అయిదు నిమిషాలు సీట్లో నిశ్చలంగా కూర్చుండిపోయాడు.

"సార్... మంచినీళ్లు త్రాగండి..." ప్రక్క సీట్లోని మమత నీళ్లబాటిల్ అందించింది.

బాటిల్ అందుకొని నీళ్లు త్రాగి, బాటిల్ ఆమెకిచ్చి "థాంక్స్!" అన్నాడు.

"ఏమిటి సార్? మీకంటే వయసులో చిన్నవాడు, సర్వీసులో జూనియర్ అయిన రమేష్ అలా మాట్లాడుతూంటే మీరు అతని నోరు మూయించడం పోయి, సారీ చెప్పారు?" అంది మమత.

ఆమెకి శ్రీధర్ గురించి తెలుసు. ఎవర్నీ నొప్పించని వ్యక్తి. ఎప్పుడూ మాటజారని మనిషి అతను. అటువంటి మంచిమనిషితో రమేష్ అలా అవమానకరంగా మాట్లాడటం ఆమెకి బాధ కలిగించింది.

"తప్పు నాదే మమతగారూ! ఆయన్ని అడగటానికి నేనెవర్ని? ఏదైనా ప్రాబ్లమ్ ఉంటే బ్రాంచి మేనేజరుతో చెప్పాలి. అలాచేస్తే రమేష్‌పై కంప్లైంట్ చేసినట్లుంటుందని ఆయన్నే అడిగాను... ఫలితం అనుభవించాను!" అని తన పనిలో మునిగిపోయాడు శ్రీధర్.

"మీరు ఈకాలంలో ఉండవలసిన వాళ్ళు కాదు సార్!" అంది మమత- తనూ పనిలో పడుతూ.

• • •

రెండునెలల తర్వాత రమేష్‌ని శ్రీధర్ సీట్లో వేశారు.

అయితే అతికష్టమైన ఆ సీటు పని రమేష్‌కి అర్థంకాలేదు. గంటగంటకూ శ్రీధర్ దగ్గరకొచ్చి తన డౌట్స్ క్లియర్ చేసుకొని పోసాగాడు.

ఇదంతా గమనిస్తున్న మమతకు శ్రీధర్‌పై కోపం వచ్చింది.

అతని దగ్గరకొచ్చి, "సార్... మీకు మతిమరపు చాలా ఎక్కువనుకుంటాను..?!" అంది.

"లేదే... మీకెందుకా అనుమానం వచ్చింది?"

"లేకపోతే ఏమిటి సార్? రమేష్ మీతో ఎంత అవమానకరంగా మాట్లాడాడు? అది మర్చిపోయి మీరు అతనికి అంత ఓపికగా ఎలా పని నేర్పిస్తున్నారు? మీరూ 'డౌట్సుంటే బ్రాంచి మేనేజరును అడగ'మని చెప్పవచ్చుగా..?!" ఆవేశంగా అంది మమత.

"నేనలా చెప్పలేను."

"ఎందుకు చెప్పలేరు? అతనంటే భయమా? లేక మంచితనమా? లేక మొహమాటమా? ఏమిటి కారణం?"

"సంస్కారం! నేను నేర్చుకున్న సంస్కారం నన్నిలా ప్రవర్తించమనే చెబుతుంది."

ఒక్కక్షణం ఏం మాట్లాడాలో తెలియలేదు మమతకి. తర్వాత "మీరు ఎప్పుడూ ఇలాగే ఉండండి! ఎందుకంటే మీలా ఉండటం, ఆలోచించడం అందరికీ చేతకాదు కనుక!" అని అతనితో చెప్పి, తన సీట్లో కూర్చుంది.

శ్రీధర్ చెప్పిన మాట నిజంగా ఆమెకు ఎంతగానో నచ్చింది...

'తెలివితేటలు అందరికీ ఒకే లెవెల్లో ఎలా ఉండవో, సంస్కారం కూడా అందరిలో ఒకేలా ఉండదు. అలా ఉండి ఉంటే మనుషుల మధ్య ఇన్ని మనస్తాపాలూ, స్పర్థలూ, కక్షలూ ఉండేవి కావు కదా..!' అని మనసులో అనుకుంది మమత.

పాఠకుల కోసం, సాహితీప్రియుల కోసం

**జయంతి పబ్లికేషన్స్**

ప్రచురించిన పుస్తకాల గురించి క్లుప్తంగా వివరిస్తూ రూపొందించిన పూర్తి కేటలాగ్ కోసం చివరిపేజీల్లో చూడండి.